TGTEL/26/A6780

# స్పందన

తెలుగు దినపత్రిక

సంపుటి :01 | సంచిక :08 | పేజీలు 8 | వెల : 5

శనివారం 19 సెప్టెంబర్ 2026

## బెంగాల్ ఉప పోరు.. దీదీ వర్గానికి 'ఫుట్‌బాల్ ప్లేయర్' గుర్తు

పశ్చిమ బెంగాల్‌లో ఉప ఎన్నికల నేపథ్యంలో మాజీ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ వర్గం పార్టీ పేరు ఖరారైంది. ఆమె నేతృత్వంలోని పార్టీకి 'మమతా ఆల్ ఇండియా తృణమూల్ కాంగ్రెస్' పేరును ఎన్నికల సంఘం ఖరారు చేసింది. వీరికి ఫుట్‌బాల్ ప్లేయర్ గుర్తును కేటాయించినట్లు పార్టీ వర్గాలు తెలిపాయి. మరోవైపు, అరుప్ రాయ్ నేతృత్వంలోని రెబల్స్ గ్రూప్‌నకు డెమోక్రటిక్ తృణమూల్ కాంగ్రెస్ పేరుతోపాటు ఎన్వెలప్ ను చిహ్నంగా కేటాయించినట్లు ఎన్నికల సంఘం వెల్లడించింది.



## 22ఏ భూముల వివాదాల పరిష్కారానికి
# హైలెవల్ కమిటీ

- ముగ్గురు సీనియర్ అధికారులతో కమిటీ ఏర్పాటు
- సీసీఎల్ఏ కమిషనర్ లోకేష్ కుమార్‌కు చైర్మన్ బాధ్యతలు
- పాపిరెడ్డి, రాజీవ్ గాంధీ హనుమంతు సభ్యులుగా నియామకం
- భూ బాధితుల సమస్యల పరిష్కారానికి విధివిధానాల రూపకల్పన
- కల్వకుంట్ల కుటుంబం భూములపై అసెంబ్లీలో సీఎం రేవంత్ వ్యాఖ్యలు
- రేవంత్ కుటుంబ భూముల లెక్కలూ బయటపెడతామన్న కేటీఆర్, హరీశ్‌రావు



**హైదరాబాద్, సెప్టెంబర్ 18:** తెలంగాణలో వివాదాస్పదంగా మారిన 22ఏ నిషేధిత భూముల సమస్య పరిష్కారానికి రాష్ట్ర ప్రభుత్వం ఉన్నత స్థాయి కమిటీని ఏర్పాటు చేసింది. రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి

మిగతా 2వ పేజీలో..

## మిగిలిన ఇళ్లను కూడా
# కేటాయించండి

- పంట మార్పిడిపై సహకరించాలి
- కేంద్ర మంత్రి చౌహాన్‌కు సీఎం వినతి



## సమన్వయంతో పనిచేయండి

- ఖేలో ఇండియా గేమ్స్‌ను విజయవంతం చేయండి
- గేమ్స్ నిర్వహణపై సీఎస్ ఉన్నతస్థాయి సమీక్ష





# దానం నాగేందర్‌పై
# అనర్హత వేటు

- స్పీకర్ ట్రైబ్యునల్ ఉత్తర్వులను కొట్టివేసిన హైకోర్టు
- జస్టిస్ అపరేశ్ కుమార్ సింగ్, జస్టిస్ జి. ఎం.మొహియుద్దీన్ ధర్మాసనం తీర్పు
- ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేయకుండానే కాంగ్రెస్ నుంచి లోక్‌సభకు పోటీ
- ఖైరతాబాద్ స్థానం ఖాళీ అయినట్లు స్పీకర్, ఈసీకి హైకోర్టు సమాచారం
- తీర్పుపై స్టే కోరిన దానం తరపు న్యాయవాదుల అభ్యర్థన తిరస్కరణ

## ఖైరతాబాద్ ఎమ్మెల్యే పదవి నుంచి దానం నాగేందర్ తొలగింపు

**హైదరాబాద్, సెప్టెంబర్ 18:** ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్‌పై అనర్హత వేటు వేస్తూ తెలంగాణ హైకోర్టు కీలక తీర్పు వెలువరించింది. 2023 అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థిగా గెలిచిన దానం.. ఎమ్మెల్యే పదవికి, పార్టీకి రాజీనామా చేయకుండానే 2024 లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ చేశారు. ఈ వ్యవహారంపై బీఆర్ఎస్ ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి, బీజేపీ శాసనసభాపక్ష నేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డి వేర్వేరుగా దాఖలు చేసిన పిటిషన్లపై విచారణ జరిపిన ధర్మాసనం శుక్రవారం తీర్పు ఇచ్చింది.

**స్పీకర్ నిర్ణయం తప్పుబాటు**

దానం పార్టీ ఫిరాయింపునకు పాల్పడలేదంటూ స్పీకర్ ట్రైబ్యునల్ మార్చి 11న ఇచ్చిన ఉత్తర్వులను సవాల్ చేస్తూ కౌశిక్‌రెడ్డి, మహేశ్వర్‌రెడ్డిలు హైకోర్టును ఆశ్రయించారు. పార్టీ ఫిరాయింపులకు సంబంధించిన ఆధారాలను స్పీకర్‌కు సమర్పించినప్పటికీ వాటిని పరిగణనలోకి తీసుకోలేదని

మిగతా 2వ పేజీలో..



## భూ కుంభకోణాలపై సమగ్ర విచారణ జరిపించాల్సిందే

దిల్లీ: రాష్ట్రంలో గతంలో కేసీఆర్ ప్రభుత్వ హయాంలో, ప్రస్తుత రేవంత్‌రెడ్డి ప్రభుత్వాల్లో జరిగిన భూముల కుంభకోణాలపై సమగ్ర విచారణ జరిపి ప్రజలకు వాస్తవాలను వెల్లడించాలని భాజపా రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్‌రావు డిమాండ్ చేశారు. శుక్రవారం దిల్లీలోని తెలంగాణభవన్‌లో ఆయన విలేకరులతో మాట్లాడుతూ... అని డిమాండ్ చేశారు. వచ్చే ఎన్నికల్లో తాము ఒంటరిగానే పోటీచేసి రాష్ట్రంలో ప్రభుత్వాన్ని ఏర్పాటు చేస్తామని ధీమా వ్యక్తం చేశారు.

> "రాష్ట్రంలో నాడు బతుకమ్మ ఆడనీయకుండా చేసిన నిజాంను రెండు పార్టీలు నేడు ఆదర్శంగా తీసుకోవడం సిగ్గుచేటు. సీఎం రేవంత్‌రెడ్డి, వారి మంత్రివర్గంలోని సభ్యులు ప్రైవేటు భూములను ఆక్రమించి 22ఏ కింద కుంభకోణాలకు పాల్పడుతున్నట్లు అన్ని పార్టీలు ఆరోపిస్తున్నాయి. అందువల్ల కాంగ్రెస్, భారాసల నాయకులు తమకు, తమ కుటుంబాలకు రాజకీయాల్లోకి రాకముందు ఉన్న ఆస్తులెంత? వచ్చిన తర్వాత సంపాదించిన ఆస్తులెంత? అన్న వివరాలను బహిర్గతం చేయాలి. కేసీఆర్ ప్రభుత్వంలో జరిగిన అవినీతి, భూకుంభకోణాల పైనే కాకుండా మూడేళ్ల కాంగ్రెస్ ప్రభుత్వంలో జరిగిన భూకబ్జాలు, 22ఏ కుంభకోణంపైనా సమగ్ర విచారణ జరిపించాలి"

## ఫార్ములా ఈ రేసుపై తప్పుడు కేసులు

- హైదరాబాద్ బ్రాండ్ ఇమేజ్ పెంచేందుకే రేస్ నిర్వహించాం
- అవినీతి జరిగిందంటూ కాంగ్రెస్ ప్రభుత్వం అసత్య ఆరోపణలు
- కేసులకు భయపడేది లేదు.. న్యాయవ్యవస్థపై నమ్మకం ఉంది
- ఎప్పుడు పిలిచినా విచారణకు హాజరవుతా: కేటీఆర్
- టార్గెట్ కేసీఆర్‌గానే కాంగ్రెస్ ప్రభుత్వం వ్యవహరిస్తోందని విమర్శ
- లక్ష కోట్ల ఆస్తులుంటే రూ.1,000 కోట్లకే తీసుకోండి అంటూ సవాల్



## కబ్జా జరిగినట్లు తేలితే భారాస ఎమ్మెల్యేలంతా
# రాజీనామాకు సిద్ధం

లేదని తేలితే సీఎం, మంత్రులు రాజీనామా చేస్తారా?

ముఖ్యమంత్రి రేవంత్‌కు హరీశ్‌రావు సవాల్

కాంగ్రెస్ ఎంపీలు భూములు చూస్తామంటే నేనే అన్నంపెట్టి చూపిద్దును కదా అని వ్యాఖ్య

"రాష్ట్రంలో 22ఏలో 3 లక్షల ఎకరాలు అని చెప్పి 30 లక్షల ఎకరాలను అధికారుల తప్పిదంతో చేర్చి నాలుక కరచుకుని దాన్ని కప్పిపుచ్చుకునేందుకు బురద రాజకీయాలు చేస్తున్నారు. కాంగ్రెస్ మంత్రులు, ఎమ్మెల్యేల భూబాగోతాలు బయటపెడుతున్నామనే అక్కసుతో ఇలాంటి పర్యటనలు చేస్తున్నారు. సిద్దిపేటలో పోలీసు, రెవెన్యూ ఇతర ప్రభుత్వ అధికారులకు చెందిన సుమారు 3 వేల గృహాలు 22ఏలో ఉన్నాయి.



2లో

## ఆర్టీసీలో గుర్తింపు సంఘం ఎన్నికలకు షెడ్యూల్

- ఎనిమిదేళ్ల నిరీక్షణకు తెర.. ఈ నెల 21 నుంచి ఎన్నికల ప్రక్రియ
- అక్టోబర్ 9న పోలింగ్.. 17న ఫలితాల వెల్లడి
- అక్టోబర్ 26న తుది ఓటరు జాబితా విడుదల
- వేతనాలు, డీఏ, బోనస్, ఉద్యోగ భద్రతపై యూనియన్ల ప్రచారం
- చివరిసారిగా 2016 జూలై 19న జరిగిన ఎన్నికలు







## సభను అగౌరవపరిచిన బీఆర్ఎస్

- శాసన సభ వ్యవహారాల శాఖ మంత్రి శ్రీధర్ బాబు
- సమావేశాలకు రాకూడదనే ఉద్దేశంతోనే నిబంధనల ఉల్లంఘన
- స్పీకర్ ను దూషించడం అప్రజాస్వామికం
- మాక్ అసెంబ్లీ దుర్మార్గమైన చర్య
- భూకబ్జాలపై హైపవర్ కమిటీ... నెల రోజుల్లో నివేదిక
- నిరవధికంగా వాయిదా పడిన అసెంబ్లీ

## ఎల్‌నినో అధిగమించేందుకు
# ముందస్తు కార్యాచరణ

- తాగునీటికే తొలి ప్రాధాన్యం
- రికార్డు స్థాయిలో 19,543 మెగావాట్ల విద్యుత్ డిమాండ్‌ను తీర్చాం
- వర్షాభావ పరిస్థితులతో వరి సాగు 18% తగ్గుదల
- ప్రత్యామ్నాయ పంటల వైవిధ్యీకరణకు ప్రాధాన్యం
- 'తెలంగాణ జలసిరి'తో భూగర్భ జలాల పునరుద్ధరణకు చర్యలు
- ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క



## ఉప ఎన్నిక వచ్చినా సిద్ధమే: దానం నాగేందర్

**హైదరాబాద్, సెప్టెంబర్ 18:**

ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్ హైకోర్టు తీర్పుపై తొలిసారిగా స్పందించారు. న్యాయస్థానం ఇచ్చిన తీర్పును పూర్తిగా స్వాగతిస్తున్నట్లు తెలిపారు. ఒకవేళ నియోజకవర్గంలో ఉప ఎన్నికలు జరిగితే పోటీ చేసేందుకు తాను సిద్ధంగా ఉన్నానని స్పష్టం చేశారు.

**ఉప ఎన్నిక వచ్చినా పోరాటం**

ప్రజాక్షేత్రంలో ఎన్నికల్లో పోటీ చేయడం తనకు కొత్తేమీ కాదని దానం నాగేందర్ అన్నారు. రాజకీయ పోరాటాల్లో ఎదురయ్యే సవాళ్లను ఎదుర్కొని విజయం సాధించడం తనకు అలవాటేనని వ్యాఖ్యానించారు. భవిష్యత్‌లో ఎలాంటి పరిణామాలు ఎదురైనా చట్టబద్ధంగా, రాజకీయంగా ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉన్నట్లు తెలిపారు.



**సుప్రీంకోర్టుకు వెళ్లే ఆలోచన లేదు**

హైకోర్టు ఉత్తర్వులను సవాల్ చేస్తూ ప్రస్తుతానికి సుప్రీంకోర్టును ఆశ్రయించే ఆలోచన లేదని దానం నాగేందర్ స్పష్టం చేశారు. తనపై అనర్హత వేటు పడే అవకాశం ఉన్నప్పటికీ తాను ఆందోళన చెందడం లేదన్నారు. నియోజకవర్గ ప్రజల మద్దతు తనకు ఎప్పుడూ ఉంటుందని ధీమా వ్యక్తం చేశారు.

## హైకోర్టు తీర్పు ప్రజాస్వామ్య విజయం

**హైదరాబాద్, సెప్టెంబర్ 18 :**

ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్ పార్టీ ఫిరాయింపు వ్యవహారంలో హైకోర్టు ఇచ్చిన చారిత్రక తీర్పును బీజేపీ స్వాగతిస్తోందని పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రామచందర్ రావు అన్నారు. బీజేపీ శాసనసభాపక్ష నేత ఏలేటి మహేశ్వర్ రెడ్డి దాఖలు చేసిన పిటిషన్‌పై విచారణ జరిపిన హైకోర్టు నాగేందర్‌ను అనర్హుడిగా ప్రకటించడమే కాక ఒక పార్టీపై గెలిచి మరో పార్టీ తరఫున నామినేషన్ వేసిన నాటినుంచే ఆ అనర్హత వర్తిస్తుందని పేర్కొనడం, స్పీకర్ నిర్ణయాన్ని పక్కనపెట్టడం అత్యంత కీలక పరిణామమని పేర్కొన్నారు. ఈ విజయం నైతికంగా, చట్టపరంగా రాజ్యాంగానికి లభించిన తిరుగులేని గెలుపని కొనియాడారు. చేతిలో రాజ్యాంగ పుస్తకం పట్టుకుని నీతులు చెప్పే రాహుల్ గాంధీ తన తండ్రి రాజీవ్ గాంధీ తెచ్చిన 10వ షెడ్యూల్ (పార్టీ ఫిరాయింపుల నిరోధక చట్టం) మార్గదర్శకాలను స్వయంగా విస్మరించడం హాస్యాస్పదమని విమర్శించారు. గతంలో బీఆరఎస్ ప్రభుత్వం ఏ విధంగానైతే పార్టీ ఫిరాయింపులను ప్రోత్సహించిందో నేటి కాంగ్రెస్ ప్రభుత్వం కూడా అదే దారిలో వెళ్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. హైకోర్టు తాజా తీర్పు కాంగ్రెస్ ప్రభుత్వ అనైతిక విధానాలకు చెంపపెట్టు అని, నైతికంగా, చట్టపరంగా, రాజ్యాంగబద్ధంగా కాంగ్రెస్ ప్రభుత్వం ఘోరంగా ఓడిపోయిందని స్పష్టం చేశారు. అంతేకాక స్పీకర్ నిర్ణయం తప్పని న్యాయస్థానంలో తేలిపోయిందన్నారు. ప్రజాస్వామ్య వ్యవస్థపై నిజమైన గౌరవం ఉంటే ఒక పార్టీ నుంచి మరో పార్టీలోకి ఫిరాయించిన ఎమ్మెల్యేలందరూ తక్షణమే తమ పదవులకు రాజీనామా చేయాలని రామచందర్ రావు డిమాండ్ చేశారు. వారు ఏ పార్టీలో చేరారో అదే పార్టీ గుర్తుపై మళ్లీ పోటీ చేసి ప్రజాక్షేత్రంలో ప్రజాతీర్పును పొంది గెలవడమే నిజమైన రాజ్యాంగ స్ఫూర్తి అని తేల్చిచెప్పారు. ప్రజాస్వామ్యాన్ని, రాజ్యాంగ విలువలను కాపాడే దిశగా వెలువడిన ఈ తీర్పు ప్రజాస్వామ్యానికే గర్వకారణమని ఆయన పునరుద్ఘాటించారు.

## ఎర్రవల్లి పరిధిలో 388 ఎకరాల్లో సర్వే ముమ్మరం

**మొదటిపేజీ తరువాయి**

జిల్లా సర్వేయర్ అనిల్, శంకర్, డివిజన్ సర్వేయర్ వంశీ, మండల సర్వేయర్ ప్రజ్వల సర్వే చేపట్టారు. ఫీల్డ్ లో సర్వే చేస్తుండగా మర్కుక్ తహసీల్దార్ కార్యాలయంలో మరి కొందరు సర్వేయర్లు ఉంటూ ఫీల్డ్ లో ఉన్న బృందాలకు ఎప్పటికప్పుడు గైడెన్స్ ఇస్తూ సమాచారం సేకరించారు.ఈ సర్వేలో ప్రభుత్వ ఉన్నతాధికారులు నేరుగా పాల్గొనలేదు.325 సర్వే నంబర్ లో మొత్తం 388ఎకరాల భూమి ఉంది.ఈ సందర్భంగా అక్కడికి వచ్చిన రైతులు మాట్లాడుతూ 325 సర్వే నంబర్ లో కేసీఆర్ పేరు మీద గానీ, ఆయన కబ్జా చేసింది గానీ ఇంచు కూడా లేదు అని,అసెంబ్లీలో సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడింది తప్పు అని చెప్పారు. మరికొందరు రైతులు 325 సర్వే నంబర్ పరిధిలో దాదాపు 80 నుండి 90 ఎకరాల్లో చెరువు తవ్వించి దానికి పాండురంగ డ్యాం అని నామకరణం చేశారని, ఆ చెరువు కింద భూములు కోల్పోయిన తమకు ఇంకోచోట భూమి ఇప్పిస్తానని చెప్పి ఇప్పటివరకు ఇప్పించలేదని ఆరోపించారు. 325 సర్వే నంబర్ లోని లావణి పట్టా భూములు 388 ఎకరాలను తమ పేరు మీద శాశ్వతంగా పట్టా చేయాలని, తమ ఆధీనంలో ఉన్న భూముల జోలికి రావద్దని రైతులు సర్వే బృందాలకు స్పష్టం చేశారు. ఈ సందర్భంగా సర్వే అధికారులు సేవ్య నాయక్ డిప్యూటీ ఇన్స్పెక్టర్ మాట్లాడుతూ 325 సర్వే నంబర్ లో ప్రభుత్వ భూమి పూర్తి విస్తీర్ణం 388.5 గుంటల భూమి ఇది మూడు గ్రామాల శివారులను శివార్ వెంకటాపూర్,వరదరాజపూర్ ఎర్రవల్లి ఆనుకొని ఉన్నదని,ఎర్రవల్లి భూమిని సర్వే చేయమని అధికారులు ఆదేశించారని తెలిపారు. ఈ సందర్భంగా సర్వే బృందాలు ఇక్కడికి చేరుకొని నాలుగు బృందాలుగా ఏర్పడి డిజిపిఎస్ రోవర్తో సర్వే నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రభుత్వం రి సర్వే చేయమని చెప్పడంతో డీజిపిఎస్ టెక్నాలజీతోనే నిర్వహిస్తున్నామని, ప్రతిది క్షుణ్ణంగా శాటిలైట్ ద్వారా పాయింట్లు తీసుకోవడం జరిగింది. దీని పూర్తి మ్యాపు తయారు చేసిన తర్వాత దీంట్లో వచ్చిన చెరువు,కెనాల్ సాగుకు ఉపయోగపడని భూమి, ఉపయోగపడే భూమి ఎంత ఉన్నది అనేది దాని మీద పూర్తి సమాచారం కొరకు ఈ సర్వే నిర్వహిస్తున్నాం అని,రైతులు ఎలాంటి ఇబ్బందులు పెట్టకుండా సర్వేకు సహకరిస్తున్నారని తెలిపారు.

## సమన్వయంతో పనిచేయండి

**హైదరాబాద్, సెప్టెంబర్ 18 :**

రాష్ట్రంలో ఖేలో ఇండియా యూత్ గేమ్స్‌ను విజయవంతంగా నిర్వహించేందుకు సమన్వయంతో కృషి చేయాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు అన్నారు. డిసెంబర్ 11 నుండి 22వ తేదీ వరకు జరిగే ఖేలో ఇండియా యువజన క్రీడల ఏర్పాట్లపై సచివాలయంలో శుక్రవారం ఉన్నతస్థాయి సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సి.ఎస్ సంజయ్ జాజు మాట్లాడుతూ హైదరాబాద్‌తోపాటు హన్మకొండ, కరీంనగర్, నిజామాబాద్, మహబూబ్ నగర్, ఖమ్మం జిల్లాల్లో ఈ పోటీలను నిర్వహిస్తున్నామని తెలిపారు. 18 ఏళ్ల లోపు వయస్సు ఉన్న క్రీడాకారులు పాల్గొనే ఈ క్రీడా పోటీలు దేశంలో జాతీయ క్రీడల అనంతరం అంతే ప్రాధాన్యత ఉన్న పోటీలని, మొత్తం 27 ఈవెంట్స్‌లో దాదాపు 6,050 మంది క్రీడాకారులు పాల్గొంటారని వివరించారు. వీటిలో 14 వ్యక్తిగత క్రీడా విభాగాలు, 6 విభాగాలు టీమ్ ఈవెంట్లు, మరో ఆరు ఇతర క్రీడా ఈవెంట్లు ఉంటాయన్నారు. ఈ ఖేలో ఇండియా యూత్ గేమ్స్‌ను విజయవంతంగా నిర్వహించేందుకు ముఖ్యమంత్రి చైర్మన్‌గా, క్రీడా శాఖ మంత్రి కోచైర్మన్‌గా మొత్తం 18 మందితోకూడిన ఆర్గనైజింగ్ కమిటీ ఏర్పాటు చేశామని వెల్లడించారు. దీంతోపాటు 28 మంది ఉన్నతాధికారులతో కూడిన ఎగ్జిక్యూటివ్ కమిటీ, మరో 18 ప్రత్యేక కమిటీలను ఏర్పాటు చేశామని సంజయ్ జాజు వెల్లడించారు. ఈ సమీక్షలో ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జయేష్ రంజన్, స్పోర్ట్స్ కార్పొరేషన్ ఎండీ సోని బాలాదేవి, కళాశాల, సాంకేతిక విద్యా శాఖ కమిషనర్ దేవసేన, జీహెచ్ఎంసీ కమిషనర్ కర్ణన్, ఐటి శాఖ జాయింట్ సెక్రటరీ అనుదీప్ దురిశెట్టి, రైతు డిస్కమ్ ఎండీ ముషారఫ్ అలీ, హెచ్ఎండీఏ కమిషనర్ సర్ఫరాజ్ అహ్మద్ తదితర సీనియర్ అధికారులు పాల్గొన్నారు.

# దానం నాగేందర్‌పై అనర్హత వేటు

**మొదటిపేజీ తరువాయి**

వారు వాదించారు. ఈ పిటిషన్లపై విచారణ అనంతరం స్పీకర్ నిర్ణయాన్ని హైకోర్టు తప్పుబట్టింది. ఆగస్టు 21న తీర్పును రిజర్వ్ చేసిన ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అపరేశ్ కుమార్ సింగ్, జస్టిస్ జి.ఎం.మొహియుద్దీన్‌ల ధర్మాసనం శుక్రవారం తీర్పు వెలువరించింది.
ఈ తీర్పుతో ఖైరతాబాద్ అసెంబ్లీ స్థానం ఖాళీ అయినట్లు స్పీకర్, ఎన్నికల సంఘానికి హైకోర్టు సమాచారం ఇచ్చింది. దీంతో రాష్ట్ర రాజకీయాల్లో ఈ వ్యవహారం కీలక పరిణామంగా మారింది.

**స్టేకు హైకోర్టు నిరాకరణ**

తీర్పు అమలుపై స్టే విధించి, సుప్రీంకోర్టులో అప్పీల్ చేసుకునేందుకు సమయం ఇవ్వాలని దానం నాగేందర్ తరఫు న్యాయవాదులు కోరారు. ఎమ్మెల్యేను వెంటనే పదవి నుంచి తొలగిస్తే నియోజకవర్గ ప్రజలకు ఇబ్బందులు తలెత్తే అవకాశం ఉందని కోర్టుకు తెలిపారు. అయితే ఈ అభ్యర్థనను హైకోర్టు తిరస్కరించింది.

**తీర్పును స్వాగతించిన బీజేపీ**

దానం నాగేందర్ అనర్హతపై హైకోర్టు తీర్పును బీజేపీ స్వాగతించింది. ఒక పార్టీ తరఫున గెలిచి మరో పార్టీలో కొనసాగడాన్ని ప్రశ్నిస్తూ తాము న్యాయపోరాటం చేశామని బీజేపీఎల్పీ నేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డి తెలిపారు. స్పీకర్ నిర్ణయాన్ని హైకోర్టు కొట్టివేయడం ప్రజాస్వామ్య పరిరక్షణలో కీలక పరిణామమన్నారు.
పార్టీ మారిన ఎమ్మెల్యేలతో రాజీనామా చేయించి ప్రజల తీర్పు కోరాలని కాంగ్రెస్‌ను ఆయన డిమాండ్ చేశారు. హైకోర్టు తీర్పుపై సుప్రీంకోర్టుకు వెళ్లకుండా దాన్ని గౌరవించి వెంటనే రాజీనామా చేయాలని కోరారు. ప్రతివాదులు సుప్రీంకోర్టును ఆశ్రయించకుండా ఉండేందుకు బీజేపీ తరఫున కేవియట్ దాఖలు చేయనున్నట్లు మహేశ్వర్‌రెడ్డి తెలిపారు.

# మిగిలిన 8 మంది ఎమ్మెల్యేల సంగతేంటి?

**హైదరాబాద్, సెప్టెంబర్ 18:**

ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్‌పై తెలంగాణ హైకోర్టు అనర్హత వేటు వేయడంతో రాష్ట్ర రాజకీయాల్లో పార్టీ ఫిరాయింపుల అంశం మరోసారి తెరపైకి వచ్చింది. అయితే దానం కేసుతో పాటు కాంగ్రెస్‌లో చేరిన ఇతర బీఆర్ఎస్ ఎమ్మెల్యేలపై దాఖలైన అనర్హత పిటిషన్లపైనా ఇప్పుడు చర్చ మొదలైంది.

**దానం కేసు ప్రభావం ఎంత?**

మిగిలిన ఎనిమిది మంది ఎమ్మెల్యేల విషయంలోనూ దానం నాగేందర్‌కు వచ్చిన తీర్పే పునరావృతమవుతుందని ఇప్పుడే నిర్ధారించలేం. ఆయా కేసుల్లోని వాస్తవాలు, అందుబాటులో ఉన్న ఆధారాలు, పిటిషన్లలో చేసిన అభ్యర్థనలు, సంబంధిత ఎమ్మెల్యేల చర్యలను న్యాయస్థానం విడివిడిగా పరిశీలించాల్సి ఉంటుంది. అయితే దానం కేసులో హైకోర్టు తీర్పు రావడం వల్ల ఇతర ఫిరాయింపు కేసుల్లోనూ న్యాయపరమైన వాదనలకు కొత్త ప్రాధాన్యం ఏర్పడింది. దీంతో పెండింగ్‌లో ఉన్న పిటిషన్ల తదుపరి విచారణలు, వాటిపై న్యాయస్థానం తీసుకునే నిర్ణయాలపై రాజకీయ పర్గాల్లో ఆసక్తి పెరిగింది.

**బీఆర్ఎస్ వాదన ఇదే**

దానం నాగేందర్‌పై వచ్చిన తీర్పు మిగిలిన ఫిరాయింపు ఎమ్మెల్యేల కేసులపైనా ప్రభావం చూపుతుందని బీఆర్ఎస్ నేతలు చెబుతున్నారు. దీంతో కాంగ్రెస్‌లో చేరిన ఆ ఎనిమిది మంది ఎమ్మెల్యేలపై పెండింగ్‌లో ఉన్న అనర్హత పిటిషన్ల పరిస్థితి ఏమిటన్నది ఇప్పుడు తెలంగాణ రాజకీయాల్లో కీలక చర్చగా మారింది.

## ఆర్టీసీలో గుర్తింపు సంఘం ఎన్నికలకు షెడ్యూల్

- **ఎనిమిదేళ్ల నిరీక్షణకు తెర.. ఈ నెల 21 నుంచి ఎన్నికల ప్రక్రియ**
- **అక్టోబర్ 9న పోలింగ్.. 17న ఫలితాల వెల్లడి**
- **అక్టోబర్ 26న తుది ఓటరు జాబితా విడుదల**
- **దాదాపు 48 వేల మంది ఉద్యోగులు ఓటు హక్కు వినియోగించుకోనున్నట్లు అంచనా**
- **వేతనాలు, డీఏ, బోనస్, ఉద్యోగ భద్రతపై యూనియన్ల ప్రచారం**
- **చివరిసారిగా 2016 జూలై 19న జరిగిన ఎన్నికలు**

**హైదరాబాద్, సెప్టెంబర్ 18:**

తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ (టీజీఎస్ఆర్టీసీ)లో గుర్తింపు కార్మిక సంఘం ఎన్నికలకు ఎట్టకేలకు షెడ్యూల్ ఖరారైంది. ఎనిమిదేళ్లుగా ఎన్నికల కోసం ఎదురుచూస్తున్న కార్మికులకు మార్గం సుగమమైంది. కార్మిక శాఖ జాయింట్ డైరెక్టర్, ఎన్నికల రిటర్నింగ్ అధికారి నోటిఫికేషన్ విడుదల చేయడంతో ఈ నెల 21 నుంచే ఎన్నికల ప్రక్రియ ప్రారంభం కానుంది. అక్టోబర్ 9న పోలింగ్ నిర్వహించనుండగా, అక్టోబర్ 17న ఫలితాలు ప్రకటించనున్నట్లు అధికారులు తెలిపారు. అక్టోబర్ 26న అన్ని జిల్లాల్లో తుది ఓటరు జాబితాను విడుదల చేయనున్నారు.

**గుర్తింపు సంఘాలకు కీలక హక్కులు**

ఆర్టీసీలో పలు కార్మిక సంఘాలు ఉన్నప్పటికీ ఎన్నికల్లో విజయం సాధించిన సంఘాలకే గుర్తింపు లభిస్తుంది. రీజియన్, రాష్ట్ర స్థాయిల్లో ఈ సంఘాలు కార్మికుల తరఫున వ్యవహరిస్తాయి. రెండు స్థాయిల ఎన్నికలకు వేర్వేరు బ్యాలెట్ పత్రాలను వినియోగిస్తారు. వేతనాలు, బోనస్, కరవు భత్యం (డీఏ), సర్వీస్ నిబంధనలు తదితర అంశాలపై యాజమాన్యం, ప్రభుత్వంతో చర్చలు జరిపే చట్టపరమైన హక్కు గుర్తింపు సంఘాలకు ఉంటుంది. కార్మికుల తరఫున ఒప్పందాలు కుదుర్చుకోవడంలోనూ ఇవే కీలకంగా వ్యవహరిస్తాయి. రీజియన్‌లోని అధికారి స్థాయి ఉద్యోగులను మినహాయించి మిగిలిన ఉద్యోగులు, కార్మికులందరికీ ఓటు హక్కు ఉంటుంది.

**ప్రధాన అజెండాగా కార్మిక సమస్యలు**

వాస్తవానికి గుర్తింపు సంఘం ఎన్నికలు 2018లోనే జరగాల్సి ఉన్నా అప్పట్లో నిర్వహించలేదు. ఈసారి దాదాపు 48 వేల మంది ఉద్యోగులు ఓటు హక్కు వినియోగించుకోనున్నారు. ఎన్నికల నేపథ్యంలో ఇప్పటికే పలు కార్మిక సంఘాలు ప్రచారాన్ని ముమ్మరం చేశాయి. వేతన సవరణ, ఉద్యోగ భద్రత, కార్మికుల సమస్యల పరిష్కారం తదితర అంశాలను ప్రధానంగా ప్రస్తావిస్తున్నాయి. ఎన్నికలను పారదర్శకంగా నిర్వహించేందుకు కార్మిక శాఖ ఏర్పాట్లు చేస్తోంది.

## మిగిలిన ఇళ్లను కూడా కేటాయించండి

**హైదరాబాద్, సెప్టెంబర్ 18 :**

పీఎంఏవై జీ పథకంలో భాగంగా మొదటి విడతగా రాష్ట్రానికి రెండు లక్షల ఇండ్లను కేటాయించినందుకు కేంద్ర వ్యవసాయ, గృహ నిర్మాణ శాఖ మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్‌కు కృతజ్ఞతలు తెలిపిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మిగిలిన 9.56 లక్షల ఇండ్లను కేటాయించాలని కోరారు. హైదరాబాద్ పర్యటనలో ఉన్న ఆయనను మాదాపూర్‌లో శుక్రవారం సీఎం కలిశారు. 1,56,915 అర్హులైన గ్రామీణ కుటుంబాలకు ఇండ్లు మంజూరు చేయాలని గత జూలైలో కేంద్ర మంత్రికి ఢిల్లీలో ముఖ్యమంత్రి వినతి పత్రం అందించారు. ప్రస్తుతం రెండు లక్షల ఇళ్లే కేటాయించినందున మిగిలిన ఇండ్లను కూడా కేటాయించాలని కోరారు. ఈ సందర్భంగా రాష్ట్రంలో ఎల్‌నినో ప్రభావంపై కేంద్ర మంత్రికి వివరిస్తూ వర్షాభావ పరిస్థితుల నేపథ్యంలో వ్యవసాయంలో విద్యుత్ వినియోగం పెరిగిందని తెలిపారు. తాగునీరు, విద్యుత్ కొరత తలెత్తకుండా రాష్ట్ర ప్రభుత్వం ముందస్తు ప్రణాళికలు సిద్ధం చేసిందని వివరించారు. వ్యవసాయ రంగంలో ఎల్ నినో పరిస్థితులను ఎదుర్కొనేందుకు కేంద్రం నుంచి అవసరమైన సహకారం అందించాలని కోరారు. దేశంలో ఎక్కడా లేని విధంగా పేదలకు రేషన్ షాపుల ద్వారా సన్న బియ్యాన్ని అందిస్తున్నామని, సన్న వడ్లకు రూ.500 బోనస్ అందించి ప్రోత్సహిస్తున్నామని చెప్పారు. ఎల్‌నినో నేపథ్యంలో రాష్ట్రంలో ప్రత్యామ్నాయ పంటల వైపు రైతులను ప్రోత్సహిస్తున్నామని సీఎం వివరించారు. 250 ఎకరాల్లో అంతర్జాతీయ ప్రమాణాలతో ఫ్రూట్స్, వెజిటబుల్ మార్కెట్ ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. పంట మార్పిడిపై రైతులను ప్రోత్సహించాల్సిన అవసరాన్ని గుర్తించి సహకరించాలని కేంద్ర మంత్రిని కోరారు. సీఎం వెంట మంత్రులు పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, తుమ్మల నాగేశ్వరరావు, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు, ఇతర ఉన్నతాధికారులు ఉన్నారు.

## ఫార్ములా ఈ రేసుపై తప్పుడు కేసులు

**హైదరాబాద్, సెప్టెంబర్ 18:**

ఫార్ములా ఈ కార్ రేస్ నిర్వహణలో ఎలాంటి అవినీతి జరగలేదని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్ స్పష్టం చేశారు. హైదరాబాద్ బ్రాండ్ ఇమేజ్‌ను అంతర్జాతీయ స్థాయిలో పెంచాలనే ఉద్దేశంతోనే రేస్ నిర్వహించామని తెలిపారు. ఈ వ్యవహారంలో తనపై తప్పుడు కేసులు పెట్టారని ఆరోపించారు. ఫార్ములా ఈ రేస్ కేసు విచారణలో భాగంగా నాంపల్లి ఏసీబీ కోర్టుకు హాజరైన ఆయన మీడియాతో మాట్లాడారు.

**న్యాయవ్యవస్థపై నమ్మకం**

కేసులకు తాము భయపడబోమని, న్యాయవ్యవస్థపై తమకు అపారమైన నమ్మకం ఉందని కేటీఆర్ అన్నారు. పోలీసులు ఎంత వేధించినా ప్రజాస్వామ్య పద్ధతిలో న్యాయవ్యవస్థ తమకు అండగా ఉంటుందని ధీమా వ్యక్తం చేశారు. ఫార్ములా ఈ రేస్ కేసులో ఎప్పుడు విచారణకు పిలిచినా హాజరయ్యేందుకు సిద్ధంగా ఉన్నానని చెప్పారు.

**లక్ష కోట్ల ఆరోపణలపై సవాల్**

పక్క రాష్ట్రాలు తమ బ్రాండ్ ఇమేజ్‌ను పెంచుకునేందుకు అంతర్జాతీయ స్థాయిలో కార్యక్రమాలు నిర్వహిస్తున్నాయని కేటీఆర్ అన్నారు. తమిళనాడు సీఎం విజయ్ ఫార్ములా ఈ రేస్ కోసం లండన్ వెళ్లారని పేర్కొన్నారు. ఇలాంటి ప్రయత్నాలు చేస్తున్న ఇతర రాష్ట్రాలతో పోలిస్తే తెలంగాణలో మాత్రం తప్పుడు కేసులు పెడుతున్నారని విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం లక్ష్యంగా కేసీఆర్‌ను పెట్టుకుని పనిచేస్తోందని ఆరోపించారు. తమపై లక్ష కోట్లు సంపాదించారంటూ అసత్య ప్రచారం చేస్తున్నారని అన్నారు. తమ పేరుతో లక్ష కోట్ల ఆస్తులు ఉంటే రూ.1,000 కోట్లు తీసుకుని, మిగిలిన రూ.99 వేల కోట్లను రాష్ట్ర ప్రజలకు ఇచ్చిన హామీల కోసం ఖర్చు చేయాలని రేవంత్‌రెడ్డికి సవాల్ విసిరారు. కాళేశ్వరం విషయంలో లక్ష కోట్లంటూ ప్రచారం చేసినట్టే ఇప్పుడు కూడా తమపై విషప్రచారం చేస్తున్నారని కేటీఆర్ వ్యాఖ్యానించారు.

## నిరంకుశ నిజాం ఆదర్శమా?

**న్యూఢిల్లీ, సెప్టెంబర్ 18 :**

అసెంబ్లీలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మాట్లాడిన మాటలు, బీఆర్ఎస్‌కాంగ్రెస్ నేతలు పరస్పరం చేసుకుంటున్న ఆరోపణలు చూస్తుంటే ఆ రెండు పార్టీల అసలు నైజం ఏమిటో ప్రజలు స్పష్టంగా గమనించాల్సిన అవసరం ఉందని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.రామచందర్ రావు అన్నారు. ఢిల్లీలో శుక్రవారం నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. గతంలో కేసీఆర్ పదేపదే నిజాంను మంచి పరిపాలకుడని, గొప్ప పనులు చేశాడని కీర్తిస్తే మొన్న అసెంబ్లీలో సీఎం రేవంత్ రెడ్డి సైతం నిజాం చాలా గొప్ప మనిషంటూ పొగడ్తలతో ముంచెత్తడం ఈ రెండు పార్టీల వక్ర వైఖరికి నిదర్శనమని మండిపడ్డారు. నాడు నిజాం పాలనలో పల్లెల్లో కనీసం ఆడబిడ్డలు బతుకమ్మను కూడా ఆడుకోలేని పరిస్థితులు ఉండేవని గుర్తు చేశారు. జలియన్ వాలాబాగ్ తరహాలో పరకాల, జోడేఘాట్, గుండ్రాంపల్లి, వెయ్యి ఊడల మర్రి (నిర్మల్) వంటి అనేక ప్రాంతాల్లో ప్రజలను విచక్షణా రహితంగా కాల్చి చంపిన రక్త చరిత్ర నిజాం సర్కారుదని అన్నారు. అలాంటి క్రూరమైన నిజాంను నేడు ప్రజాస్వామ్య పాలనలో ఇద్దరు ముఖ్యమంత్రులు ఆదర్శంగా తీసుకుంటున్నారంటే అంతకంటే దారుణం మరొకటి ఉండదని మండిపడ్డారు.

# 22ఏ భూముల వివాదాల పరిష్కారానికి హైలెవల్ కమిటీ

**మొదటిపేజీ తరువాయి**

శ్రీనివాస్‌రెడ్డి ఆదేశాల మేరకు ముగ్గురు సీనియర్ అధికారులతో కమిటీని నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. నిషేధిత జాబితాలో చేరిన భూములకు సంబంధించిన వివాదాలను పరిశీలించి, బాధితులకు పరిష్కారం చూపే విధంగా కమిటీ విధివిధానాలను రూపొందించనుంది.

**ముగ్గురు అధికారులతో కమిటీ**

సీసీఎల్ఏ కమిషనర్ లోకేష్‌కుమార్ కమిటీకి చైర్మన్‌గా వ్యవహరించనున్నారు. పాపిరెడ్డి, రాజీవ్ గాంధీ హనుమంతు సభ్యులుగా ఉంటారు. 22ఏ జాబితాలో పొరపాటుగా చేరిన ప్రైవేట్ భూములు, నిషేధిత భూములకు సంబంధించిన ఇతర వివాదాలను పరిశీలించి తగిన పరిష్కార మార్గాలను కమిటీ సూచించనుంది.

**భూముల వివరాలపై సీఎం ఆరోపణలు**

రాష్ట్రంలో అటవీ, అసైన్డ్, దేవాదాయ శాఖలకు చెందిన 1.02 కోట్ల ఎకరాలు 22ఏ నిషేధిత జాబితాలో ఉన్నాయని సీఎం రేవంత్‌రెడ్డి ఇటీవల అసెంబ్లీలో పేర్కొన్నారు. వీటిని తొలగించే అధికారం మంత్రులకు కూడా లేదని స్పష్టం చేశారు. నిజాం కాలం నుంచి కొనసాగుతున్న భూ సమస్యలపై సమగ్రంగా చర్చించాల్సిన అవసరం ఉందన్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ధరణి పోర్టల్ ద్వారా 2.50 కోట్ల ఎకరాల భూముల వివరాలు విదేశీ మాఫియా చేతుల్లోకి వెళ్లాయని రేవంత్‌రెడ్డి ఆరోపించారు. ప్రభుత్వ భూములను రిజిస్ట్రేషన్ చేయడం, అధికారుల పొరపాట్లతో ప్రైవేట్ భూములు 22ఏ జాబితాలో చేరడం వల్ల సమస్యలు ఏర్పడ్డాయని తెలిపారు.

**కల్వకుంట్ల కుటుంబ భూములపైనా వ్యాఖ్యలు**

22ఏ జాబితాలో 12 అంశాలను గుర్తించామని, సభ్యుల సూచనల ఆధారంగా పేదలకు న్యాయం చేస్తామని సీఎం తెలిపారు. రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డిపై బీఆర్ఎస్ నేతలు అసత్య ప్రచారం చేస్తున్నారని విమర్శించారు. తెలంగాణ ఉద్యమకారులు నష్టపోతే కేసీఆర్ కుటుంబం మాత్రం వేల కోట్లు, వందల ఎకరాల ఆస్తులు సంపాదించిందని రేవంత్‌రెడ్డి వ్యాఖ్యానించారు. కల్వకుంట్ల కుటుంబం, వారి బంధువుల పేరిట తొమ్మిది జిల్లాల్లో ఉన్న 439.30 ఎకరాల భూముల వివరాలను సర్వే నంబర్లతో సహా అసెంబ్లీలో వెల్లడించారు. ఎర్రవల్లి ఫాంహౌస్ భూముల్లో ప్రభుత్వ భూములతో పాటు రైతుల నుంచి తీసుకున్న భూములు ఉన్నాయనే ఆరోపణలపై 30 రోజుల్లో విచారణ జరిపి నివేదిక ఇవ్వాలని సిద్దిపేట కలెక్టర్‌ను ఆదేశించినట్లు తెలిపారు.
దీనిపై కేటీఆర్, హరీశ్‌రావు స్పందిస్తూ రేవంత్‌రెడ్డి కుటుంబం పేరిట కూడా వందల ఎకరాల భూములు ఉన్నాయని ఆరోపించారు. వాటికి సంబంధించిన వివరాలను త్వరలోనే ప్రజల ముందుంచుతామని వారు ప్రకటించారు.

# చైర్ పర్సన్ కుటుంబ సభ్యుల పెత్తనం...



- కౌన్సిలర్లే ఆర్టిఐ బాట పట్టారు
- ఇస్నాపూర్ మున్సిపాలిటీలో... లోపించిన పారదర్శకత
- కౌన్సిలర్లే ఆర్టిఐ పెడితే...? సామాన్యుడికి దిక్కెవరు!
- కౌన్సిలర్ల రగడ సద్దుమణిగిందా?

**పటాన్ చెరు, సెప్టెంబర్ 18, (స్పందన):**

బల్దియా పాలకవర్గంలో కీలక పాత్ర పోషించే కౌన్సిలర్లే ఆర్టిఐ బాట పడుతున్నారు. పుర మున్సిపాలిటీలో కౌన్సిలర్లకు ఆశించిన స్థాయిలో సముచిత స్థానం దక్కకపోవడంతో రాత కోతలకు సిద్ధమవుతున్నారనే విషయం చెప్పకనే చెప్పవచ్చు. ప్రతిపక్ష పార్టీకి చెందిన కౌన్సిలర్లు కొందరు ఓవైపు చైర్పర్సన్, మరోవైపు కమీషనర్ పనితీరుపై గుర్రుగా ఉన్నారు. ఇదే విషయంపై గత ఏప్రిల్ నెల చివరన ఇస్నాపూర్ మున్సిపాలిటీ వేదికగా కొందరు కౌన్సిలర్లు ప్రెస్మీట్ పెట్టి మరి తమ గోడు విన్నవించుకున్నారు. ఇదే విషయమై జిల్లా కలెక్టర్ కు ప్రజావాణిలో ఫిర్యాదులు సైతం చేయాలని నిర్ణయించుకున్నట్టు విశ్వసనీయ సమాచారం. "తీగ లాగితే డొంక కదిలినట్టుగా" కొంత చిన్న అవకాశాన్ని వాడుకుని వారి ప్రయత్నాలను చైర్ పర్సన్ కుటుంబ సభ్యులు నిర్వీర్యం చేసినట్లు ఇస్నాపూర్ మున్సిపాలిటీలో గుసగుసలు వినిపిస్తున్నాయి. ప్రతిపక్ష పార్టీ కౌన్సిలర్లకు అధికార యంత్రాంగం సహకరించడం లేదని ఆరోపణతో స్వయంగా కౌన్సిలర్లే ఆర్టిఐ ఫిర్యాదులు చేస్తున్నారు. "తిలా పాపం తలా పిడికెడు" అన్న చందంగా వార్డుల వారిగా కౌన్సిలర్లు ఏకమై తమ హక్కుల న్యాయపోరాటానికై దిగుతున్నారనే వాదనలు సైతం వినిపిస్తున్నాయి. చైర్ పర్సన్ కుటుంబ సభ్యుల పెత్తనం నానాటికి పెరిగిపోతోందని, ఇప్పటికైనా వారికి అడ్డుకట్ట వేయాలని కాంగ్రెస్ పార్టీకి చెందిన కౌన్సిలర్లు యోచనలో ఉన్నట్టు వినిపిస్తోంది.

**టౌన్ ప్లానింగ్ శాఖపై....**

మరీ ముఖ్యంగా ఇస్నాపూర్ మున్సిపాలిటీ టౌన్ ప్లానింగ్ విభాగం అధికారులపై కాంగ్రెస్ పార్టీకి చెందిన కౌన్సిలర్లు తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తిన సందర్భాలు కోకొల్లలు. రుద్రారం వార్డు పరిధిలో నూతనంగా ఏర్పాటైన ఓ వెంచర్ పై పార్టీలకతీతంగా నలుగురు కౌన్సిలర్లు "కాళ్లకు బలపాలు కట్టుకుని" మరి కార్యాలయం చుట్టూ తిరిగినట్టు సమాచారం. నూతనంగా ఏర్పడిన మున్సిపాలిటీలో ప్రతిపక్ష పార్టీ కౌన్సిలర్లను కనీసం పట్టించుకునే నాధుడే కరువయ్యాడని పలువురు తీవ్రంగా ఆరోపిస్తున్నారు. బల్దియా ప్రజలచే ఎన్నుకోబడిన కౌన్సిలర్లకే చుక్కలు చూపించే అధికారులు ప్రజా సమస్యలపై ఏ విధంగా స్పందిస్తారో అర్థం చేసుకోవడం పెద్ద వింతేమీ కాకపోవచ్చు. "ఎలుకకు పిల్లి సాక్ష్యం" అన్న చందంగా... టౌన్ ప్లానింగ్ విభాగం అధికారులకు దీటుగా ఇంజనీరింగ్ విభాగం అధికారులు సైతం వ్యవహరిస్తున్నారు. మున్సిపాలిటీకి అత్యవసరమైన సామాగ్రి కొనుగోళ్లలో పారదర్శకత మచ్చుకైనా కానరావడం లేదని సర్వత్రా విమర్శలు వినిపిస్తున్నాయి.




## నిర్వీర్యం అవుతున్న ఆర్టిఐ...

**- కమిషనర్ వెంకట కిషన్**




అప్పట్లో కేంద్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన ఆర్టిఐ విధానం ఇస్నాపూర్ మున్సిపాలిటీలో పూర్తిగా నిర్వీర్యం అవుతోందని కమిషనర్ వెంకట కిషన్ ఓ దశలో ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజా ప్రయోజనాల నిమిత్తం వాడాల్సిన బ్రహ్మాయుధం లాంటి ఆర్టిఐనిది

కొందరు తమ తమ స్వప్రయోజనాలకై ఉపయోగించుకోవడం పట్ల ఆయన విచారం వ్యక్తం చేశారు. ప్రజలకు మేలు కలిగేలా ఉండేటట్లు ఆర్టిఐని ఓ సాధనంగా వాడుకుంటే బాగుంటుందని ఆయన సూచించారు.

# కాంట్రాక్ట్ జీతమే జీవనం

- ఒక్క ఎకరమే ఆధారం
- చివరికి విధిలోనే విషాదం....

**జహీరాబాద్ సెప్టెంబర్ 18 (స్పందన)**



గుండెపోటుతో వాచ్ మెన్ మృతి చెందిన సంఘటన న్యాల్కల్ మండలంలోని ఖలీల్ పూర్ గ్రామంలో శుక్రవారం చోటు చేసుకుంది. వివరాలలోకి వెళితే గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం ఒక్క ఎకరమే అదీ వర్షం పడితేనే పంట. ఆ పంటతో కడుపు నిండక కళాశాల గేటు ముందు కాపలాగా నిలబడి కుటుంబాన్ని పోషించుకున్న ఆ కాంట్రాక్ట్ వాచ్‌మెన్ చివరికి అదే విధి నిర్వహణలో కన్నుమూశాడు. మిర్జాపూర్ బీ ఓయూ పీజీ కళాశాలలో కాంట్రాక్ట్ వాచ్‌మెన్ వైద్యనాథ్(55) రోజూ మాదిరిగానే తెల్లవారుజామునే లేచి విధులకు హాజరవుతాడు. శుక్రవారం కూడా అలాగే పని నిమిత్తం వచ్చాడు. కానీ గుండెపోటు రూపంలో మృత్యువు పలకరించింది. ఛాతిలో నొప్పితో విలవిల్లాడుతూ తోటి ఉద్యోగి శివకు చెప్పాడు. కుటుంబం ఆటోలో జహీరాబాద్ ఆసుపత్రికి తీసుకెళ్లేలోపే ప్రాణం విడిచాడు. మరణించిన వ్యక్తికి ముగ్గురు పిల్లలు. ఇద్దరికి పెళ్లి చేశాడు. చిన్న కొడుకు పెళ్లి చేయాలి. అప్పుల్లో ఉన్న ఎకరం పొలం, నెలనెలా వచ్చే కాంట్రాక్ట్ జీతమే ఆ కుటుంబానికి ఆధారం. ఇప్పుడా ఆధారమే పోయింది. మాకు దిక్కెవరు అంటూ కుటుంబం సభ్యులు రోధిస్తున్న దృశ్యాలను గ్రామంలో విషాద ఛాయలు అలుము కొన్నాయి. ప్రభుత్వం యూనివర్సిటీ అధికారులు ఆదుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు. కుటుంబాన్ని ఆదు కుంటామని ప్రిన్సిపాల్ శివకుమార్ భరోసా ఇచ్చారు.

# విఘ్నేశ్వరుని ఆశీస్సులతో ప్రజలందరికీ సుఖశాంతులు కలగాలి

- నీలం మధు ముదిరాజ్..హైదరాబాద్ బడా గణేశుని దర్శించుకుని ప్రత్యేక పూజలు
- ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన అన్నదాన కార్యక్రమంలో పాల్గొన్న నీలం..

**పటాన్ చెరు, సెప్టెంబర్ 18, (స్పందన):**





ఖైరతాబాద్‌లో కొలువుదీరిన బడా గణేష్‌ను మెదక్ పార్లమెంట్ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి నీలం మధు ముదిరాజ్ శుక్రవారం దర్శించుకున్నారు. ఈ సందర్భంగా విఘ్నేశ్వర స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించి, రాష్ట్ర ప్రజలందరికీ ఆయురారోగ్యాలు, సుఖశాంతులు కలగాలని అయన ప్రార్థించారు. దర్శనం అనంతరం ఆలయ నిర్వాహకులు నీలం మధుకు తీర్థప్రసాదాలు అందించి, వేద ఆశీర్వచనాలతో సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఖైరతాబాద్ బడా గణేష్ ప్రతి సంవత్సరం లక్షలాది మంది భక్తులను ఆకర్షించే మహా గణపతిగా దేశవ్యాప్తంగా ప్రత్యేక గుర్తింపు పొందిందన్నారు. ఈ పవిత్ర క్షేత్రాన్ని ప్రతిసారి లాగే ఈ సారి కూడా దర్శించుకోవడం ఆనందంగా ఉందని నీలం మధు తెలిపారు. వినాయక నవరాత్రి ఉత్సవాలు భక్తి, ఐక్యత, సేవా భావానికి ప్రతీకగా నిలుస్తాయని పేర్కొంటూ, ప్రతి ఇంటా విఘ్నేశ్వరుని కృపతో శాంతి, సౌభాగ్యం నెలకొనాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఖైరతాబాద్ గణేష్ ఉత్సవ కమిటీ చైర్మన్ రాజ్ కుమార్, ఫౌండర్ వీణ మాధురి, రాజశేఖర్, మొగోల్, రాజు, బాబుల్, సందీప్, రాకేష్, అభిషేక్, ఉత్సవ కమిటీ సభ్యులు, ఎన్ఎంఆర్ యువసేన సభ్యులు తదితరులు పాల్గొన్నారు

# కోటి ఎకరాలు 22Aలో ఉందని కేటీఆర్, హరీష్ రావు దుష్ప్రచారం

**బీఆర్ఎస్ హయాంలో ధరణి తెచ్చి, 22.93 లక్షల ఎకరాలు 22A లో పెట్టారు**

**కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక ఈ విస్తీర్ణాన్ని ఏడు లక్షల ఎకరాలకు తగ్గించాం**

**22Aలో కేవలం 3.75 లక్షల ఎకరాలు మాత్రమే ఉంది**

**సంగారెడ్డి, సెప్టెంబర్ 18(స్పందన)**

లితొమ్మిదిన్నర ఏళ్ల పాలనలో అక్రమంగా అసైన్డ్ భూములను బీఆర్ఎస్ వాళ్లు దోచుకున్నారని
కేసీఆర్, హరీష్ రావు, కేటీఆర్ దోచుకున్న భూముల వివరాలన్నీ బయటపెడతామని
టిపిసిసి అధికార ప్రతినిధి శ్రీరంగం సత్యం అన్నారు.డీసీసీ అధ్యక్షురాలు నిర్మలా జగ్గారెడ్డితో కలిసి సంగారెడ్డిలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు.
కేసీఆర్ ఆదేశాల మేరకు కేటీఆర్, హరీష్ రావు 22(ఏ) జాబితా విషయంలో దుష్ప్రచారం సాగిస్తున్నారని అన్నారు. బీఆర్ఎస్ హయాంలో ధరణి తీసుకొచ్చి, ఏకంగా 22.93 లక్షల ఎకరాలు 22(ఏ)లో పెట్టిన వాళ్లే.. ఇప్పుడు అవాకులు, చవాకులు పేలుతున్నారని విమర్శించారు. డీసీసీ అధ్యక్షురాలు నిర్మలా జగ్గారెడ్డి తో



కలిసి సంగారెడ్డిలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత నిషేధిత జాబితాలో ఉన్న భూముల విస్తీర్ణాన్ని 7 లక్షల ఎకరాలకు తగ్గించామని ఆయన వివరించారు. ప్రస్తుతం 22 ఏ లో కేవలం 3.75 లక్షల ఎకరాల భూమి మాత్రమే ఉందన్నారు. ఈ సమస్యకు పరిష్కారం చూపేందుకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చిత్తశుద్ధితో పనిచేస్తున్నారని ఆయన స్పష్టం చేశారు. కేటీఆర్, హరీష్ రావు మాత్రం ప్రజలను గందరగోళానికి గురి చేసేలా కోటి ఎకరాలు 22(ఏ) లో ఉందని దుష్ప్రచారం సాగిస్తున్నారని ఆయన మండిపడ్డారు. తొమ్మిదిన్నరేళ్ల పాలనలో, ధరణిని అడ్డుపెట్టుకొని టిఆర్ఎస్ నేతలు అసైన్డ్ భూములను దోచుకున్నారని ఆయన వివరించారు.లి

**బీఆర్ఎస్ నేతలు దోచుకున్న భూముల వివరాలను బయట పెడతాం**

తొమ్మిదిన్నరేళ్ల పాలనలో అడ్డగోలుగా పట్టాలు సృష్టించి, బీఆర్ఎస్ నేతలు దోచుకున్న భూముల వివరాలన్నింటినీ బయట పెడతామని ఈ సందర్భంగా టీపీసీసీ అధికార ప్రతినిధి సత్యం శ్రీరంగం వెల్లడించారు. కేసీఆర్ ఆర్ పాలనలో అన్ని వర్గాలకు అన్యాయమే జరిగిందన్నారు. బిల్లులు రాక ఎంతోమంది సర్పంచులు ఆత్మహత్యలకు పాల్పడ్డారని గుర్తు చేశారు. లక్ష కోట్లు ఖర్చు చేసి కాళేశ్వరం కట్టిన బిఆర్ఎస్ నేతలు రాష్ట్రాన్ని దివాలా తీయించారన్నారు. అప్పుల భారం ఉన్నప్పటికీ, కాంగ్రెస్ ప్రజా పాలనలో హామీలన్నింటిని నెరవేరుస్తూ ముందుకు సాగుతున్నామన్నారు. హైదరాబాద్ నగరాన్ని ప్రపంచ స్థాయి నగరంగా తీర్చిదిద్దేందుకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అనుక్షణం తపిస్తున్నారని అన్నారు.

దళితులను అవమానించిన బీఆర్ఎస్ నేతలు

ఫామ్ హౌస్ ముందు డప్పు కొట్టిన దళితులను అవమానించేలా, ఆ రోడ్లను పసుపు నీళ్లతో శుద్ధి చేశారని ఆయన అన్నారు. స్పీకర్ను అవమానించేలా అనుచిత వ్యాఖ్యలు చేసిన విషయాన్ని ఈ సందర్భంగా ఆయన గుర్తు చేశారు.

**ప్రజా పాలనలో అన్ని వర్గాలకు న్యాయం**

కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన ఈ 30 నెలల్లో ఇచ్చిన, ఇవ్వని హామీలను నెరవేరుస్తున్న విషయాన్ని గుర్తు చేశారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఎన్నో కొత్త పాలసీలు తెచ్చి అభివృద్ధి, సంక్షేమాన్ని కొనసాగిస్తున్నారని వివరించారు.
బీఆర్ఎస్ పార్టీతో లోపాయికారి ఒప్పందం చేసుకొని, ఎంపీగా గెలిచిన రఘునందన్ రావు కాంగ్రెస్, బీఆర్ఎస్ ఒక్కటే అని మాట్లాడడం విడ్డూరంగా ఉందని విలేకరులు అడిగిన ప్రశ్నకు సత్యం శ్రీరంగం సమాధానం ఇచ్చారు. బీఆర్ఎస్ పార్టీతో బీజేపీ లోపాయికారి ఒప్పందం చేసుకోవడం వల్లనే ఎనిమిది మంది బీజేపీ ఎంపీలు గెలిచారని అన్నారు.ఈ విలేకరుల సమావేశంలో టీపీసీసీ అధికార ప్రతినిధి తోపాజి అనంత కిషన్, కాంగ్రెస్ పార్టీ సంగారెడ్డి నియోజకవర్గ ఇంచార్జ్ చేర్యాల ఆంజనేయులు, సీడీసీ చైర్మన్ గడీల రామ్ రెడ్డి, సీనియర్ నాయకులు రఘు గౌడ్, మునిపల్లి సత్యనారాయణ, కూన సంతోష్, పట్టణ అధ్యక్షులు కిరణ్ గౌడ్, ఎస్సీ సెల్ అధ్యక్షులు శ్రీహరి తదితరులు పాల్గొన్నారు.

# చాల్కీలో అట్టహాసంగా వినాయక నిమజ్జనం



- మాణిక్ ప్రభు ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో నిమజ్జనం
- ఐదు రోజులు అన్న ప్రసాదం ఏర్పాటు చేసిన బిఆర్ఎస్ నేత అశోక్ యాదవ్

న్యాల్ కల్: న్యాల్ కల్ మండల పరిధిలోని చాల్కి గ్రామంలో వినాయక నిమజ్జనం శుక్రవారం ఘనంగా నిర్వహించారు. గ్రామంలోని మానిక్ ప్రభు మందిరం వద్ద ఏర్పాటు చేసిన వినాయక మండపం వద్ద గత ఐదు రోజులు గా సాయిబాబా ఫర్టిలైజర్స్ యజమాని అశోక్ యాదవ్ ఆధ్వర్యంలో అన్న ప్రసాద వితరణ చేశారు. ఈ సందర్భంగా అశోక్ యాదవ్ మాట్లాడుతూ చాల్కి గ్రామం పై వినాయకుడు తన కరుణ కటాక్షాలు ప్రసాదించి గ్రామస్తులందరిని సుఖ సంతోషాలతో వర్ధిల్ల చేయాలని ఆకాంక్షించారు.

# లోనికలాన్ పాఠశాలలో ఫుడ్ పాయిజన్ ఘటనపై విచారణ

**34 మంది విద్యార్థులు కోలుకున్నారు.. ఎలాంటి అపాయం లేదన్న వైద్యులు**

**మునిపల్లి, సెప్టెంబరు 18 ( స్పందన )**

జిల్లా విద్యాశాఖాధికారి సంగారెడ్డి ఆదేశాల మేరకు మునిపల్లి మండలం లోనికలాన్‌లోని ఎంపీపీఎస్ జడ్పీహెచ్ఎస్ పాఠశాలలను మండల విద్యాధికారి భీమ్‌సింగ్, కాంప్లెక్స్ హెడ్‌మాస్టర్ సంతోషి కుమారి, కంకోల్ కాంప్లెక్స్ హెడ్‌మాస్టర్ తుకారాం శుక్రవారం సందర్శించి ఫుడ్ పాయిజన్ ఘటనపై విచారణ చేపట్టారు.
పాఠశాల హెడ్‌మాస్టర్ సునీత కులకర్ణి, ఉపాధ్యాయులు, విద్యార్థులను విచారించి ఘటనకు సంబంధించిన పూర్తి వివరాలను సేకరించారు.
పాఠశాల ఉపాధ్యాయుడు వెంకటేశం తీసుకొచ్చిన చికెన్ బిర్యానీ తిన్న అనంతరం కొంతమంది విద్యార్థులకు వాంతులు కావడంతో వారిని సదాశివపేట, సంగారెడ్డి ప్రభుత్వ ఆసుపత్రులకు తరలించినట్లు విచారణలో వెల్లడైంది.
సంగారెడ్డి ప్రభుత్వ ఆసుపత్రిలో 12 మంది, సదాశివపేట ప్రభుత్వ ఆసుపత్రిలో 22 మంది, మొత్తం 34 మంది విద్యార్థులు చికిత్స పొందిన అనంతరం కోలుకున్నారని అధికారులు తెలిపారు. విద్యార్థులను పరామర్శించగా అందరూ ఆరోగ్యంగా ఉన్నట్లు గుర్తించారు.
వైద్యులను సంప్రదించగా ప్రస్తుతం ఎలాంటి అపాయం లేదని వారు వెల్లడించినట్లు అధికారులు తెలిపారు.
ఘటనపై సేకరించిన పూర్తి వివరాలతో కూడిన విచారణ నివేదికను జిల్లా విద్యాశాఖాధికారికి పంపినట్లు మండల విద్యాశాఖ అధికారులు తెలిపారు.





# 22ఏ భూములకు గుడ్ న్యూస్..

**జల్దీగా సాల్వ్ చేస్తామంటున్న సర్కార్!**

**హైదరాబాద్, సెప్టెంబర్ 18:**




22ఏ జాబితాలో ఉన్న భూముల సమస్యలకు చెక్ పెట్టేందుకు తెలంగాణ ప్రభుత్వం కీలక ముందడుగు వేసింది. ఏళ్లుగా రిజిస్ట్రేషన్లు నిలిచిపోయి ఇబ్బందులు పడుతున్న భూ యజమానులకు పరిష్కారం చూపేందుకు ముగ్గురు సభ్యులతో హై-లెవల్ కమిటీ ఏర్పాటు చేసింది. సీసీఎల్ఏ కమిషనర్ చైర్మన్‌గా, లా సెక్రటరీ, స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ ఐజీ సభ్యులుగా ఉంటారు. 118 జీవో బాధితుల సమస్యలపైనా కమిటీ ఫోకస్ పెట్టనుంది. నెల రోజుల్లో సమస్యలను సాల్వ్ చేయాలని నిర్ణయించినట్లు మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి అసెంబ్లీలో తెలిపారు. 22ఏ నుంచి అర్హత ఉన్న భూములను లిఫ్ట్ చేసేందుకు దరఖాస్తులు స్వీకరిస్తామని చెప్పారు.



# చిరంజీవి సరసన స్నేహా.. 'కాకా'లో కీలక పాత్ర?

హైదరాబాద్, సెప్టెంబరు 17 ::

మెగాస్టార్ చిరంజీవి, దర్శకుడు బాబీ కొల్లి కాంబినేషన్‌లో తెరకెక్కుతున్న 'కాకా' చిత్రంపై టాలీవుడ్‌లో ఆసక్తి నెలకొంది. ఇప్పటికే విడుదలైన ప్రచార చిత్రాలు, గ్లింప్స్ సినిమాపై అంచనాలను పెంచాయి. ఈ నేపథ్యంలో చిత్రానికి సంబంధించి ఓ ఆసక్తికరమైన వార్త సినీ వర్గాల్లో చక్కర్లు కొడుతోంది. సీనియర్ నటి స్నేహ ఈ సినిమాలో చిరంజీవి సరసన నటించనున్నట్లు ప్రచారం జరుగుతోంది. ఇండస్ట్రీ వర్గాల సమాచారం ప్రకారం 'కాకా'లో స్నేహ చిరంజీవి భార్య పాత్రలో కనిపించనున్నట్లు తెలుస్తోంది. అయితే దీనిపై చిత్రబృందం నుంచి అధికారిక ప్రకటన రావాల్సి ఉంది. గతంలో ఓ ఇంటర్వ్యూలో స్నేహ మాట్లాడుతూ.. తన కెరీర్‌లో చిరంజీవితో కలిసి ఒక్కసారైనా నటించాలనేది తన కోరిక అని చెప్పినట్లు సమాచారం. ప్రస్తుతం ఆమె సెకండ్ ఇన్నింగ్స్‌లో ఎంపిక చేసుకుని సినిమాలు చేస్తున్నారు. ఇక ఈ చిత్రంలో చిరంజీవి పాత్ర కూడా విభిన్నంగా ఉండనున్నట్లు తెలుస్తోంది. ఆక్వా పరిశ్రమలో సాధారణ సూపర్‌వైజర్‌గా 'కె. సత్యం' అనే పాత్రలో ఆయన కనిపించనున్నట్లు సమాచారం. బయటకు ప్రశాంతంగా, సాధారణంగా కనిపించే ఈ పాత్ర వెనుక బలమైన భావోద్వేగ నేపథ్యం ఉన్నట్లు గ్లింప్స్ ద్వారా తెలుస్తోంది. మలయాళ యువ నటి అనస్వర రాజన్ ఈ చిత్రంలో 'అమ్ములు పాప' అనే కీలక పాత్రలో నటిస్తున్నారు. కథను మలుపుతిప్పే పాత్రగా దీనిని చిత్రబృందం పేర్కొన్నట్లు సమాచారం. కేవీఎన్ ప్రొడక్షన్స్ భారీ బడ్జెట్‌తో నిర్మిస్తున్న ఈ మాస్ ఎంటర్‌టైనర్ 2027 జనవరి 13న సంక్రాంతి కానుకగా ప్రపంచవ్యాప్తంగా విడుదల కానుంది. స్నేహ పాత్రపై త్వరలోనే అధికారిక ప్రకటన వెలువడే అవకాశం ఉందని సినీ వర్గాల్లో ప్రచారం జరుగుతోంది.

# ప్రమాదం తర్వాత పండు మాస్టర్ కీలక నిర్ణయం

హైదరాబాద్, సెప్టెంబరు 17 ::

బుల్లితెరపై తనదైన డ్యాన్స్, కామెడీతో ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న 'ఢీ' ఫేమ్ పండు మాస్టర్ ప్రస్తుతం తీవ్ర గాయాలతో విశ్రాంతి తీసుకుంటున్నారు. ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదంలో ఆయన రెండు కాళ్లకు తీవ్ర గాయాలు కావడంతో వైద్యులు శస్త్రచికిత్స నిర్వహించారు. ప్రస్తుతం కదల్లేని పరిస్థితిలో మంచంపైనే ఉంటూ చికిత్స తీసు కుంటున్నారు. పూర్తిగా కోలుకుని మళ్లీ డ్యాన్స్ చేయడానికి మరికొంత సమయం పట్టే అవకాశం ఉంది. ప్రమాదం కారణంగా పండు మాస్టర్ కొంతకాలం స్టేజ్ షోలు, టెలివిజన్ కార్యక్రమాలకు దూరంగా ఉండాల్సి వచ్చింది. సాధారణంగా కళాకారులకు కార్యక్రమాలు, ప్రాజెక్టుల ద్వారా ఆదాయం వస్తుంటుం ది. అయితే ప్రస్తుతం పనుల కు వెళ్లే పరిస్థితి లేకపోవ డంతో ఆయన తన కెరీర్‌ను కొనసా గించేందుకు మరో మార్గాన్ని ఎంచుకున్నారు. ఇప్పటివరకు సామాజిక మాధ్యమాల ద్వారా అ భిమానులతో అనుసంధా నంగా ఉన్న పండు మా స్టర్.. ఇకపై సొంతంగా ప్రారంభిం చినయూ ట్యూబ్ ఛానెల్ ద్వా రా తన ప్రయాణాన్ని కొనసా గించాలని నిర్ణయించుకున్నారు.



# కత్రినా కైఫ్‌కు ట్రోలింగ్.. అండగా నిలిచిన సహ నటులు

హైదరాబాద్, సెప్టెంబరు 17 ::

బాలీవుడ్ స్టార్ హీరోయిన్ కత్రినా కైఫ్ ప్రసవం తర్వాత తన శరీరాకృతిలో వచ్చిన మార్పుల కారణంగా సామాజిక మాధ్యమాల్లో ట్రోలింగ్ ఎదుర్కొంటున్నట్లు సమాచారం. ఇటీవల ఆమెకు సంబంధించిన కొన్ని ఫొటోలు వైరల్ కావడంతో కొందరు నెటిజన్లు ప్రతికూల వ్యాఖ్యలు చేశారు. అయితే కత్రినాకు పలువురు సినీ ప్రముఖులు, అభిమానులు మద్దతుగా నిలుస్తున్నారు. నటుడు విక్కీ కౌశల్‌ను వివాహం చేసుకున్న కత్రినా.. కుమారుడు విహాన్ జన్మించిన తర్వాత బహిరంగ కార్యక్రమాలకు దూరంగా ఉంటున్నారు. ఇటీవల అంబానీ కుటుంబం నిర్వహించిన గణేశ్ ఉత్సవాలకు హాజరైన సందర్భంగా తీసిన ఆమె ఫొటోలు సామాజిక మాధ్యమాల్లో వైరల్ అయ్యాయి. ఈ ఫొటోల ఆధారంగా కొందరు ఆమె రూపంపై వ్యాఖ్యలు చేయడంతో వివాదం మొదలైంది. కత్రినాతో 'మేరే బ్రదర్ కీ దుల్హన్' చిత్రంలో కలిసి నటించిన పాకిస్థానీ నటుడు అలీ జాఫర్ ఈ ట్రోలింగ్‌పై స్పందించారు. మహిళల పట్ల పురుషులు తమ దృక్పథాన్ని మార్చుకోవాలని సూచిస్తూ.. కత్రినాను ఆమె జీవితాన్ని ప్రశాంతంగా గడపనివ్వాలని ట్రోలర్లకు హితవు పలికారు. నటి శివలీక ఒబెరాయ్ కూడా కత్రినాకు మద్దతుగా స్పందిస్తూ, మాతృత్వం తర్వాత శరీరంలో మార్పులు సహజమేనని పేర్కొన్నారు. నటి అలియా భట్ సైతం కత్రినా తాజా ఫొటోలను ఇష్టపడటం ద్వారా తన మద్దతు తెలిపినట్లు తెలుస్తోంది. ఈ ఘటనతో మహిళా నటుల శరీరాకృతి, అందంపై సామాజిక మాధ్యమాల్లో ఉండే అంచనాలు, ప్రసవం తర్వాత మహిళలపై వచ్చే వ్యాఖ్యలపై మరోసారి చర్చ మొదలైంది. అయితే తనపై వస్తున్న విమర్శలపై కత్రినా కైఫ్ ఇప్పటివరకు బహిరంగంగా స్పందించలేదు. ప్రస్తుతం ఆమె కుటుంబంతో సమయం గడుపుతూ, తన వ్యక్తిగత వ్యాపార కార్యకలాపాలపై దృష్టి సారిస్తున్నట్లు సమాచారం.



# సంక్రాంతికి 'కాక'.. విడుదల తేదీ ఖరారు




హైదరాబాద్, సెప్టెంబరు 17 ::

మెగాస్టార్ చిరంజీవి, దర్శకుడు బాబీ (కేఎస్ రవీంద్ర) కలయికలో తెరకెక్కుతున్న మాస్ యాక్షన్ ఎంటర్‌టైనర్ 'కాక' విడుదల తేదీ ఖరారైంది. ఈ సినిమాను వచ్చే సంక్రాంతి కానుకగా 2027 జనవరి 13న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో విడుదల చేయనున్నట్లు చిత్రబృందం అధికారికంగా ప్రకటించింది. దీంతో సినిమా విడుదలపై ఇప్పటివరకు కొనసాగుతున్న ఊహాగానాలకు తెరపడింది. 'వాల్తేరు వీరయ్య' తర్వాత చిరంజీవి, బాబీ మరోసారి కలిసి పనిచేస్తుండటంతో ఈ చిత్రంపై అభిమానుల్లో ఆసక్తి నెలకొంది. చిరంజీవి మాస్ ఇమేజ్‌కు అనుగుణంగా భారీ యాక్షన్ అంశాలతో పాటు వినోదానికి ప్రాధాన్యం ఇస్తూ దర్శకుడు బాబీ ఈ చిత్రాన్ని రూపొందిస్తున్నట్లు సమాచారం. కేవీఎన్ ప్రొడక్షన్స్ పతాకంపై వెంకట్ నారాయణ ఈ చిత్రాన్ని భారీ బడ్జెట్‌తో నిర్మిస్తున్నారు. ఇప్పటికే చిత్రీకరణకు సంబంధించిన పలు అప్‌డేట్లు ప్రేక్షకుల్లో ఆసక్తిని పెంచుతున్నాయి. ఈ సినిమాకు సంబంధించిన తొలి పాటను త్వరలోనే విడుదల చేయనున్నట్లు చిత్రబృందం ప్రకటించింది. సంక్రాంతి బరిలో జనవరి 13న ప్రేక్షకుల ముందుకు రానున్న 'కాక'పై మెగాస్టార్ అభిమానుల్లో భారీ అంచనాలు నెలకొన్నాయి. విడుదల తేదీని అధికారికంగా ప్రకటించడంతో ఇక సినిమా ప్రచార కార్యక్రమాలను వేగవంతం చేసేందుకు చిత్రబృందం సిద్ధమవుతోంది.



# ఆ పాట చిత్రీకరణలో కన్నీళ్లు పెట్టుకున్న తమన్నా

హైదరాబాద్, సెప్టెంబరు 17 ::

అగ్ర కథానాయిక తమన్నా నటిస్తున్న తాజా చిత్రం 'ది వివాన్' త్వరలో ప్రేక్షకుల ముందుకు రానుంది. సిద్ధార్థ్ మల్హోత్రా కథానాయకుడిగా నటిస్తున్న ఈ చిత్రానికి సంబంధించిన ట్రైలర్ ఇటీవల విడుదలైంది. అడవి నేపథ్యంలో సాగే మైథలాజికల్ థ్రిల్లర్‌గా ఈ సినిమాను రూపొందిస్తున్నారు. ఈ చిత్రంలో ఛఠ్ పూజ నేపథ్యంలో చిత్రీకరించిన ఓ పాట తన కెరీర్‌లోనే ఎంతో ప్రత్యేకమైనదని తమన్నా తెలిపింది. ముంబయిలో పుట్టి పెరిగిన తనకు జుహూ బీచ్‌లో వేలాది మంది మహిళలు ఛఠ్ పూజ నిర్వహించడం గతంలో కనిపించేదని ఆమె గుర్తుచేసుకుంది. అయితే ఆ సంప్రదాయం వెనుక ఉన్న విశేషాలు తనకు అప్పట్లో తెలియవని చెప్పింది. సినిమా కోసం ఆ పూజకు సంబంధించిన పాటను చిత్రీకరిస్తున్న సమయంలో దాని ప్రత్యేకత, భక్తిశ్రద్ధలు తనకు అర్థమయ్యాయని తమన్నా పేర్కొంది. దాదాపు 36 గంటల పాటు నీటిని కూడా తీసుకోకుండా మహిళలు భక్తితో ఛఠ్ పూజలో పాల్గొంటారని, బీహారీ సంస్కృతిలో ఈ పూజకు ఎంతో ప్రాధాన్యం ఉందని తెలిపింది. ఉదయించే సూర్యుడిని పూజించడంతో పాటు అస్తమించే సూర్యుడికి కూడా సమానమైన ప్రాధాన్యత ఇవ్వడం తనను ఆకట్టుకుందని చెప్పింది. పాట చిత్రీకరణ సమయంలో తాను భావోద్వేగానికి లోనై కన్నీళ్లు పెట్టుకున్న సందర్భాలు ఉన్నాయని తమన్నా తెలిపింది. ఏదో అతీతమైన శక్తి తనలోకి ప్రవేశించిన అనుభూతి కలిగిందని, ఆ పాట తన హృదయాన్ని కదిలించిందని పేర్కొంది. 'ది వివాన్'లోని ఈ పాట ప్రేక్షకులకు కూడా ప్రత్యేక అనుభూతిని అందిస్తుందని చిత్రబృందం భావిస్తోంది.

Printed, Published, Owned by Md Nazeer Ahmed, Published from 5-8-124/231, Narayana Reddy colony, Sangareddy, Telangana 502001 Printed At Saketh Printers SY. No. 212, Trinetra Complex, Veerabadra Nagar, Sangareddy, Telangana 502001,RNI NO TGTEL26/A6780